క్లుప్తంగా

టమాటకు పెరుగుతున్న ధర



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న టమాట

రొంపిచెర్ల: మండలంలో టమాట పంటకు ధర క్రమంగా పెరుగుతుండడంతో రైతుల మోముల్లో ఆనందం తొంగిచూస్తోంది. మండలంలో 600 ఎకరాల్లో రైతులు టమాట సాగు చేశారు. దిగుబడి బాగా వచ్చేవేళకు ధర 30 కిలోలు రూ.70 పలికింది. దీంతో రైతులు నష్టాల పాలయ్యే పరిస్థితి కలిగింది. అయితే మూడు రోజులుగా టమాట పంటకు ధర పుంజుకోవడం, ప్రస్తుతం ఒక 30 కిలోల బాక్స్ ధర రూ.500 నుంచి రూ.600 పలుకుతుంది. కనీసం పెట్టుబడి అయినా దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నారు. అయితే ఇప్పటికే పంట 70 శాతం కోతలయ్యాయి. 30 శాతం పంట ఉండగా ధర రావడంతో రైతులు కొంతవరకు ఆనందంగా ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతి

సదుం: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కుమార్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల స్థలాలు, అందరికీ అక్రిడేషన్, జర్నలిస్టులకు భద్రత..ఇత్యాది వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రామయ్య, శ్రీనివాసులు, భాస్కర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

73 స్పౌజ్ పింఛన్లు మంజూరు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలో పింఛన్లు పొందుతూ మరణించిన వారికి సంబంధించి వారి భాగస్వాములకు(స్పౌజ్ పింఛన్లు)73 మందికి మంజూరు చేసినట్లు ఎంపీడీఓ రాజశేఖరబాబు తెలిపారు. దేవళంపేట: 9, దిగువపోకలవారిపల్లె:2, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె:4, గడ్డంవారిపల్లె:8, కల్లూరు:8, కమ్మపల్లె:4, కావేటిగారిపల్లె:3, మంగళంపేట:7, మతుకువారిపల్లె:1, పులిచెర్ల:10, రాయవారిపల్లె:5, వెంకటదాసరపల్లె:7, ఎల్లంకివారిపల్లె:5 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయని తెలియజేశారు.

రోడ్డు విస్తరణ సాధ్యమయ్యేనా..?

కుప్పం పట్టణం నడిబొడ్డున రోడ్డు విస్తరణ పనులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రెండు విడతలుగా పూర్తి చేసిన పనులు మూడవ విడత అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీన్ని పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. విస్తరణ వల్ల భవనాలు కోల్పోతున్న బాధితులతో సమావేశం నిర్వహించి రాజీయత్నం చేసింది. నష్టపరిహారం చెల్లింపు విషయంలో ఇరుపక్షాలకు పొంతన కుదరకపోవడంతో సమావేశం ఫలితం ఇవ్వలేదు. దీంతో మూడవ విడత విస్తరణ పనులు సాధ్యమయ్యేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- అడుగుకు రూ.30వేల చొప్పున ఇవ్వాలని బాధితుల డిమాండ్
- రూ.5వేలు ఇస్తామంటున్న అధికార యంత్రాంగం
- ససేమిరా అంటున్న బాధితులు

కుప్పం: మూడవ రీచ్ పనులు చేపట్టేందుకు అధికారులు సంసిద్ధమవుతున్న తరుణంలో నష్టపోతున్న బాధితులు అడుగు స్థలానికి రూ.30వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 2014–19 మధ్య కాలంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బాధితులకు ఇచ్చిన నష్టపరిహారం మేరకు కాకుండా పెంచాలని కోరుతున్నారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ల ఫీజులు భూముల విలువ పెంచడంతో బాధితులు నష్టపరిహారం దీనికి అనుగుణంగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. మూడవ రీచ్ పనులు ఎమ్ఆర్ రెడ్డి సర్కిల్ నుంచి రైల్వే గేటు వరకు చేయాల్సి



మూడవ రీచ్ పనులు చేయవలసిన రోడ్డు ఇదే

ఉంది. రోడ్డుకు ఇరువైపులా కమర్షియల్ కాంప్లెక్స్, భారీ భవనాలు ఉండడంతో వీరికి నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

కోట్ల రూపాయల విలువ చేసే భూములకు లక్షలేనా?

రోడ్డు విస్తరణలో నష్టపోయిన బాధితులకు అడుగుకు రూ.5 వేలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. అలా అయితే తాము చాలా నష్టపోతామని, కోట్ల రూపాయలు విలువ చేసే భూములకు లక్షల్లో కూడా నష్టపరిహారం రాదని మండిపడుతున్నారు. పట్టణ నడిబొడ్డున రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ వందేళ్ల కాలంగా ఉంటున్న తమకు సంబంధించి భవనాలను కూల్చి వేస్తే జీవనాధారం కోల్పోయి రోడ్డున పడాల్సి వస్తుందని, తమ డిమాండ్‌కు అనుగుణంగా ఇస్తే తప్పితే తమ భవనాలను ఇచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు.

నాడు రూ.7వేలు ఇస్తే.. ఇప్పుడు రూ.5వేలేనా! ఇదేం న్యాయం?

2014–19లో పట్టణంలో మొదటి, రెండవ రీచ్‌లలో నష్టపోయిన బాధితులకు అడుగు రూ.7వేలు చెల్లించారు. ప్రస్తుతం మూడవ రీచ్‌కు మాత్రం రూ.5వేలు ఇస్తామనడం ఎంత వరకు న్యాయమని బాధితుల ప్రశ్న. 1, 2 రీచ్‌ల కంటే మూడవ రీచ్‌లో విలువైన భవనాలు, భూములు వున్నాయి. వీటి ధరలు కూడా అధికంగా వున్నాయి. దీని ప్రకారం పరిహారం పెంచి ఇవ్వాలేగానీ తగ్గిస్తామనడం కూటమి ప్రభుత్వానికి తగదని స్థానికులు నిరసిస్తున్నారు. పరిహారం గిట్టుబాటు అయ్యేంత వరకు పనులు జరగనివ్వమని తేల్చి చెప్పారు.

నోటీస్ బోర్డు

- **నేడు ప్రజాభిప్రాయ సేకరణ**

శాంతిపురం: గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణం కోసం భూ సేకరణ ప్రక్రియకు సంబంధించి గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివయ్య బుధవారం తెలిపారు. స్థానిక మండల సచివాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, కడా ప్రాజెక్టు డైరెక్టర్, కుప్పం ఆర్డీఓ, విమానాశ్రయ భూ సేకరణ అధికారులు పాల్గొంటారని చెప్పారు. 30 సాన్నేగానిపల్లె, దండికుప్పం, అమ్మవారిపేట రెవెన్యూ గ్రామాల రైతులు హాజరై తమ అభిప్రాయం తెలియజేయాలని కోరారు.

- **13లోపు ఈకేవైసీ చేయించాలి**

సదుం: పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ఫలాలు పొందేందుకు రైతు సేవా కేంద్రాలలో ఈనెల 13 లోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ మాధవి బుధవారం కోరారు. అలాగే ఇప్పటివరకూ రైతు విశిష్ట సంఖ్యకు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు వెంటనే చేయించుకోవాలని, అలా చేయించుకోని పక్షంలో వారికి పథకాలు దరి చేరవన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



బ్రహ్మ కమలం పుష్పాలతో మౌనిక

చౌడేపల్లె(పుంగనూరు): పుంగనూరు నాగపాళ్యంలో నివాసమున్న మౌనిక ఇంట బ్రహ్మకమలాలు విరబూశాయి. చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకించడంతోపాటు ఈ పుష్పాలకు పూజలు చేశారు. తమ సెల్‌ఫోన్లలో ఆ పుష్పాల చిత్రాలను నిక్షిప్తం చేసుకున్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల ఆందోళన



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పలమనేరు: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఏపీ కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు సమ్మె నోటీసు ఇస్తున్నట్టు చెప్పారు. తమ డిమాండ్లను ప్రస్తావించారు. టెక్నికల్ వారికి నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ వారికి రూ.24,500 వేతనంగా ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో తమకిచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. దీంతోపాటు మరో 20 డిమాండ్లపై తాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. సంఘ నాయకులు మధుబాబు, శ్రీనివాసులు, మహేష్, రాజేష్, జైపాల్ పాల్గొన్నారు.

వరదరాజులస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ శ్రీ భూదేవి సమేత వరదరాజులస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా అభిషేకం చేయించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సత్యనారాయణ వ్రతమాచరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సత్యనారాయణ వ్రతమాచరిస్తున్న భక్తులు

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈగా విజయ్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఈగా ఉన్న నరేంద్రకుమార్ తిరుపతి ఈఈగా బదిలీ అయ్యారు. అక్కడ ఉన్న విజయ్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈయనకు ఇన్‌చార్జి ఎస్ఈగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో తిరుపతి ఈఈగా ఉన్న విజయ్‌కుమార్ చిత్తూరు, తిరుపతి జిల్లాల ఇన్‌చార్జి ఎస్ఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. అనంతరం ఉద్యోగులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జీవితంలో యోగా భాగం కావాలి



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

శాంతిపురం: దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని శ్రీ పరమహంస యోగానంద స్కూలు ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయన్నారు. ప్రపంచానికి యోగాను అందించిన ఘనత భారతదేశానికే దక్కుతుందని, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రజలు యోగా ప్రాచుర్యం పొందుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పార్థీవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సాక్షి' కార్యాలయాలపై దాడులు హేయం



మాట్లాడుతున్న నాగరాజు

వి.కోట: కూటమి ప్రభుత్వం సాక్షి మీడియా గ్రూప్‌ను టార్గెట్ చేస్తూ రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై దాడులు చేయడం, అక్రమ కేసుతో సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయడం హేయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు ఖండించారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై మూడు రోజులుగా పథకం ప్రకారం పచ్చ మూకలు దాడులు చేయడం, ఫర్నిచర్‌కు నిప్పు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. పత్రికా స్వేచ్ఛను హరించేందుకు కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని, దీనికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మీడియా కార్యాలయాలకు భద్రతా కల్పించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం

చౌడేపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సన్నబియ్యం కేటాయించినట్లు ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. బుధవారం మండలానికి ప్రభుత్వం నుంచి అందిన 18 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని ఆయా పాఠశాలలకు అందజేసినట్లు ఎంఈఓ చెప్పారు.



ఉన్నత పాఠశాలలో హెచ్ఎంకు స్టాకు అందజేసిన ఎంఈఓ కేశవరెడ్డి

జాతీయ రహదారిలో

డివైడర్లతో ప్రమాదమే..!

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

గుడుపల్లె: కుప్పం నుంచి పలమనేరుకు వెళ్లే జాతీయ రహదారిలోని పీఈఎస్ కళాశాల వద్ద రోడ్డు పక్కన డివైడర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉందని కుప్పం కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రహరీ గోడకు–రోడ్డుకు మధ్య డివైడర్‌ను ఏర్పాటు చేసేందుకు నింపిన మట్టిని పరిశీలించి వారు మాట్లాడారు. కళాశాల వద్ద హోటళ్లు, ప్రయాణికులు, ఆసుపత్రికి వచ్చే వారితో నిత్యం రద్దీగా ఉంటుందని, దీంతో పాటు వచ్చిపోయే వాహనాలను స్థలం లేక రోడ్డు పక్కనే ఆపుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశం వదిలిపెడితే వాహనదారులు, ప్రయాణికులు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందని, ప్రమాదాలకు తావుండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుప్పం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గోవిందరాజులు(ఆవులగోపి), నాయకులు మునస్వామి, నంజప్ప, క్రిష్ణప్ప, సుబ్రమణ్యం, నిజాముద్దీన్, ఇర్ఫాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.



మళ్లీ ప్రైవేటుకు మొగ్గు



- నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం

శాంతిపురం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం అవుతున్నాయి. సెలవుల్లో సరదాగా గడిపిన పిల్లలు మళ్లీ బడి బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు. గతంలో పరిస్థితుల కారణంగా తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రైవేటు పాఠశాలలపై మక్కువ తల్లిదండ్రుల ఆలోచనల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో మార్పు మొదలైంది. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలను మార్చి, కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా సదుపాయాలను కల్పించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలతో పాటు యూనిఫాం, స్కూల్ బ్యాగులు, షూలు మొదలైనవి అందజేశారు. అంతేకాకుండా జగనన్న గోరుముద్ద పేరిట రుచికరమైన వంటకాలను మధ్యాహ్న భోజన పథకంలో చేర్చారు. పేదింటి బిడ్డలకు ఆంగ్ల విద్యను అందించేలా ఇంగ్లిష్ మీడియం బోధనకు శ్రీకారం చుట్టారు. సర్కారీ బడిలో అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేలా టోఫెల్ సిలబస్‌ను అమలులోకి తెచ్చే ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విద్యా రంగంలో వచ్చిన అద్భుత మార్పులు జాతీయ, అంతర్జాతీయ విద్యావేత్తల ప్రశంసలు సైతం అందుకున్నాయి. నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలో ఉచితంగా అందుబాటులోకి రావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్ల నుంచి మళ్లీ గవర్నమెంటు స్కూళ్ల బాట పట్టారు. కానీ 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తిరోగమన బాట పట్టింది. కార్పొరేట్ స్కూళ్లకు కొత్త ప్రభుత్వం దాసోహం అవడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు మళ్లీ తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్చేందుకు మొగ్గు చూపుతున్నారు.

అర్ధగిరిలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం, గంధం, తమలపాకులు, తులసిమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామికి పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. గంధంతో ప్రత్యేక అలంకరణలో స్వామి తేజోమయ రూపాన్ని వివిధ ప్రాంతాల భక్తులుదర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఉచిత ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఆలయ ఆవరణలో ఉభయదారులు భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రోచ్ఛరణ చేస్తూ సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. హోమంలో ఆలయ ఈఓ హనుమంతురావు, ఉభయదారులు పాల్గొన్నారు. రాత్రి అర్చకులు ఉత్సవమూర్తికి అభిషేకం పూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు.



సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు